క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



భజన చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : బండ్ల వీధిలోని శ్రీరామ భజన మందిరంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భజనలు చేపట్టారు. టీజీ చిన్ని కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ క్రమంలోనే శ్రీసీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొలువు తీర్చారు. భక్తులు సంకీర్తనలతో శ్రీరామచంద్రమూర్తిని కొలిచారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భజన మందిరం సభ్యులు కె.చిన్నబ్బ, లక్ష్మీదేవి, వెంకటనారాయణ, మునికృష్ణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కేఎస్ రాజా, ఉమాపతి, వాసుదేవరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న వడ్డెర సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకుని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జి.మదన్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ క్రమంలోనే వడ్డెర ఓబన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డెర ఓబన్న అందించిన సేలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నేతలు రమణ, నాగరాజు, సాంబ, శ్రీనివాసులు, బాలు, లక్ష్మణ, బాలాజీ, మునిరత్నం పాల్గొన్నారు.

కట్టమీద గంగమ్మకు పూజలు

భాకరాపేట : చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మకు సోమవారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమల పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతికం



కళాకారుల నృత్య ప్రదర్శన

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం సాయంత్రం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. తిరుపతికి చెందిన సంధ్య కళాబృందం ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శించారు. ఈక్రమంలోనే కళాకారులు సంధ్య, వినోద్, రంజిత, మహాలక్ష్మి, తనయ, స్వప్న, పూజిత, భవిష్య, మాధురి, తేజేష్, మోక్షశ్రీ, నిఖిత, రోహిత, ఆకాంక్ష, లితీష్‌ల చూడచక్కని హావభావాలతో నృత్యం చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ జ్ఞాపికలు అందజేశారు.

విశేష సేవకు పురస్కారం



రోజారమణికి అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : వివిధ రంగాలలో విశేష సేవలందించిన వారికి ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో విశిష్ట పురస్కారాలు అందించారు. సోమవారం ఈమేరకు ప్రెస్‌క్లబ్‌లో అవార్డులు ప్రదానం చేశారు. కళావేదిక అధ్యక్షుడు అరవ జయపాల్, శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధి గుత్తా హరసర్వోత్తమ నాయుడు మాట్లాడుతూ సురేంద్ర రొద్దు సామాజిక స్పృహ కలిగిన రచనలతో సాహితీ సేవలందించారని కొనియాడారు. ఆయనకు సిరివెన్నెల సినీ పురస్కారం అందించారు. అలాగే ఎస్వీ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ రోజారమణికి మదర్ థెరిస్సా పురస్కారం, కవి, రచయిత వెంకటస్వామికి సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డులు అందించారు.

కాలినడకన తిరుమలకు క్రికెటర్ నితీష్



అలిపిరి మార్గంలో వెళుతున్న నితీష్

తిరుమల: భారత్ క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి కాలినడకన తిరుమల చేరుకున్నారు. తిరుపతి అలిపిరి నడక మార్గం నుంచి బయలుదేరిన క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి సోమవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. రాత్రి తిరుమలలో బస చేసి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.

గిరిపురంలోని రామకృష్ణ డీలక్స్ వద్ద..



బైరాగిపట్టెడ రోడ్డులో..



దామలచెరువు రైల్వే గేటు వద్ద..



ముఖ్యమంత్రి చంద్రబాబు గుప్పించే హామీలన్నీ బూటకమని మరో పర్యాయం తేటతెల్లమైంది. సంక్రాంతి నాటికి రహదారులను మెరిపిస్తామని ఊదరగొట్టిన మాటలన్నీ ఉత్తుత్తువే అని ప్రజలకు పూర్తిగా అర్థమైంది. ప్రతిష్టాత్మక తిరుపతిలో ప్రధాన మార్గాలన్నీ గుంతలమయంగా మారాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలోనే చంద్రగిరి నియోజకవర్గంలో దారులు అధ్వాన్నంగా తయారయ్యాయని పల్లెవాసులు వాపోతున్నారు. ప్రయాణించాలంటే హడలిపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొర్లగుంటలో..

నెరవేరని మాట..

గుంతలుగా బాట!

- హామీ నిలబెట్టుకోని ప్రభుత్వం
- అధ్వాన్నంగా రహదారులు
- తిరుపతిలో ప్రమాదకరంగా రోడ్లు
- చంద్రగిరి నియోజకవర్గంలోనూ దయనీయం
- నానా అవస్థలు పడుతున్న వాహనదారులు
- పాదచారులకూ తప్పని ఇక్కట్లు
- మండిపడుతున్న ప్రజలు

తిరుపతి అర్బన్/ తిరుపతి రూరల్ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలోని రోడ్లు దయనీయస్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భక్తులు, స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కూటమి సర్కార్ వచ్చినప్పటి నుంచి రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదని పలువురు విమర్శిస్తున్నారు. సంక్రాంతి పండుగ సమయానికి రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా స్పందించాలని తిరుపతివాసులు కోరుతున్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో..

చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం 370 పనులు గుర్తించారు. అందుకోసం రూ.26.64 కోట్లు మంజూరు చేశారు. తిరుపతి రూరల్ మండలంలో 45 పనులకు రూ.3.99 కోట్లు, చిన్నగొట్టిగల్లు-రూ.4.42 కోట్లతో 77 పనులు, పాకాల-రూ.5.52 కోట్లతో 64 పనులు, చంద్రగిరి-రూ.5.96 కోట్లతో 86 పనులు, రామచంద్రాపురం- రూ.2.80 కోట్లతో 29, ఎర్రావారిపాళెం-రూ.3.92 కోట్లతో 69 పనులు కేటాయించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో 70 శాతం పనులు ఇంకా ప్రారంభం కాలేదు.



పాకాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద..



రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం దారి..



కాన్పుల ఆస్పత్రి మార్గంలో..

మురళీధరశర్మ సేవలు చిరస్మరణీయం



మాజీ వీసీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ మురళీధరశర్మ సేవలు చిరస్మరణీయమని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కొనియాడారు. సోమవారం మాజీ వీసీ మురళీధర శర్మ మూడో వర్ధంతి సందర్భంగా వర్సిటీలో ఆయన చిత్రపటానికి అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.వీసీ మాట్లాడుతూ విద్యాపీఠం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందడంలో మురళీధర శర్మ కృషి ఎనలేనిదన్నారు. వర్సిటీలో బాలకేంద్రాల స్థాపించి బాలలకు సంస్కృత భాషను అందించిన మహనీయుడని వెల్లడించారు. రుయా ఆస్పత్రి వద్ద సుమారు 300 మంది అనాథలకు అన్నదానం చేశారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎలమంచిలి ప్రవీణ్, మోహన్ సింగ్

తిరుపతి కల్చరల్: మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన మిస్టర్ ఇండియా-2025 పోటీల్లో తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభచూపారు. 65 కేజీల విభాగంలో జిల్లాకు చెందిన టి.వెంకటేష్, జి.లీల విజేతలుగా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే 65 కేజీల విభాగంలో టి.ఆదినారాయణ ఐదో స్థానంలో నిలిచాడు. వీరికి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎలమంచిలి ప్రవీణ్ మెడల్స్ అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు మస్కట్‌లో జరుగనున్న ఏషియన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు.



రంకెలేసిన కోడెగిత్తలు

రామచంద్రాపురం మండలం అనుప్పల్లెలో సోమవారం అశేష జనవాహిని నడుమ పరుష పందేలు నిర్వహించారు. రంకెలేస్తూ పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు దూసుకెళ్లారు. ఎద్లకు కట్టిన పలకలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు.

– రామచంద్రాపురం

వైభవంగా గోదాదేవి కల్యాణం



కల్యాణ వేదికపై కొలువైన స్వామి, అమ్మవారు

తిరుపతి కల్చరల్: ధనుర్మాసం ముగింపు సందర్భంగా అన్నమాచార్య కళాందిరంలో సోమవారం శ్రీగోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న 250 కేంద్రాలలో నెల రోజుల పాటు ప్రముఖ పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. ముందుగా శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయం నుంచి శ్రీగోదాదేవి (ఆండాళ్), శ్రీరంగనాథస్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టం చేపట్టారు. తిరుపతికి చెందిన ఎం.భానుజ బృందం గోదాదేవి వైభవాన్ని చాటే నృత్యరూపకాన్ని చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ముగిసిన తిరుప్పావై ప్రవచనాలు

టీటీడీ ఆళ్వార్ దివ్యప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో డిసెంబర్ 16 నుంచి చేపట్టిన తిరుప్పావై ప్రవచనాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. తిరుపతికి చెందిన ప్రముఖ పండితుడు చక్రవర్తి రంగనాథన్ తిరుప్పావై ప్రవచనాలు చేశారు. టీటీడీ ఎఫ్ఏసీఏవో బాలాజీ, ఆళ్వార్ దివ్యప్రబంధం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పురుషోత్తం, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: ఇద్దరి మృతి

శ్రీనివాసపుర: కర్ణాటకలో కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా రాయల్‌పాడు సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను, క్షతగాత్రులను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. మృతులు కడపకు చెందిన శివకుమార్ (55), తిరుపతికి చెందిన ప్రకాష్ (49)గా గుర్తించారు. బెంగళూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది

వైభవంగా గోవిందుని భోగి తేరు

తిరుపతి కల్చరల్ : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ప్రజలు సోమవారం భక్తి శ్రద్ధలతో భోగి పండుగ జరుపుకున్నారు. అలాగే శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో వైభవంగా భోగి తేరు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పించారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి వారిని భోగి తేరుపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. మంగళవారం మకర సంక్రాతి సందర్భంగా ఆలయంలో దేవదేవేరులకు తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం చక్రత్తాళ్వారు ఊరేగింపుగా కపిలతీర్థంలోని శ్రీఆళ్వార్ తీర్థానికి వేంచేపు చేసి చక్రస్నానం జరిపించనున్నారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయరావు పాల్గొన్నారు.



భోగి మంట వద్ద మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం కల్యాణ వెంకన్న ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు చేపట్టారు. మహిళలు వేసిన రంగవల్లులను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పరిశీలించారు. విజేతలకు ఆలయ ఈఓ సుబ్బరామిరెడ్డి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి తిరుపతికి చెందిన కీర్తి దక్కించుకోగా రెండో బహుమతి పుష్ప, మూడో బహుమతి తుమ్మలగుంటకు చెందిన అనిత అందుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి నివాసంలో..

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద సోమవారం భోగి పండుగ నిర్వహించారు. ఆయన తుమ్మలగుంటలో కుటుంబీకులతో కలసి భోగి మంట వేశారు. అనంతరం చెవిరెడ్డి సకుటుంబంగా కల్యాణ వెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గుల పోటీ

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లెలో పురుషులకు వంటలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కమ్మపల్లి పీహెచ్‌సీ మాజీ చైర్మన్ చినబాబు పర్యవేక్షించారు.



బహుమతులు అందిస్తున్న ఈఓ సుబ్బరామిరెడ్డి



తిరుపతిలో భోగి మంట వేస్తున్న యువత



ఊరేగుతున్న దేవదేవేరులు